## బండలాగుడు పోటీల్లో సత్తాచాటిన నాగర్ కర్నూల్ ఎడ్లజత



**రాచర్ల, మార్చి 3, ప్రభాతవార్త**
మండలంలోని అనుములపల్లి గ్రామంలో శ్రీ జీవనమూర్తి స్వామి 16రోజుల పండుగ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన ఎంఅక్షరారెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయానికి 3500అడుగుల దూరం లాగి తమ సత్తా చాటి రూ.50వేలు ప్రదమ బహుమతిని దక్కించుకున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 9ఎడ్లజతలు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణ రెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయానికి 3372అడుగుల దూరం లాగి రెండో బహుమతి రూ.40వేలు, వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలానికి చెందిన బి వెంకటరెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయానికి 3019.3అడుగుల దూరంలాగి మూడవ బహుమతి రూ.30వేలు, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అక్కలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కె దీక్షిత్ రెడ్డి విశాల్ రెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయానికి 2923.11అడుగుల దూరం లాగి నాల్గవ బహుమతి రూ.20వేలు, నంద్యాల జిల్లా బిల్లాపురంకు చెందిన ఎం లింగన్నగారి జగదీష్ నాయుడు ఎడ్లజత నిర్ణీత సమయానికి 2844.3అడుగుల దూరంలాగి ఐదవ బహుమతిర రూ.10వేలు, నంద్యాల జిల్లా కాకానాలకు చెందిన కె సుబ్రమణ్యం ఎడ్లజత నిర్ణీత సమయానికి 2448.11అడుగుల దూరంలాగి 6వ బహుమతి రూ.5వేలు దక్కించు కున్నాయని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు స్థానిక నాయకులు మరియు కమిటీ పెద్దల చేతులమీదుగా బహుమతులు అందజేసినట్లు వారు తెలిపారు. మిగిలిన మూడు ఎడ్లజతలకు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఎడ్ల బండలాగుడు పోటీలను స్థానిక నాయకులు, ఆలయ కమిటీ పెద్దలు, కార్యనిర్వాహకులు, వివిధ పార్టీల ప్రతినిధులు ప్రారంభించడం జరిగింది. ఈ ఎడ్ల బండలాగుడు పోటీల యాంకర్గా అక్కపల్లి గ్రామానికి చెందిన కె వెంకటరామిరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ జెడ్పిటిసి కుప్పా రంగనాయకులు, అనుములపల్లి సర్పంచ్ శిరిగిరి రమేష్, మాజీ సర్పంచ్ భూపని కాశయ్య, తెలుగుదేశం నాయకులు శిరిగిరి వెంకటపతి, శిరిగిరి హరి, స్థానిక పెద్దలు శిరిగిరి కాశీపతి, దూదిపల్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## కమలా సిబిఎస్ఈ స్కూల్లో డ్రోన్ కెమెరా టెక్నాలజీపై సెమినార్

### - ఆసక్తిగా గమనిస్తున్న విద్యార్థులు



**మార్కాపురం రూరల్, మార్చి 3 ,ప్రభాతవార్త**
స్థానిక కమలా హైస్కూల్(సిబిఎస్ఈ) నందు చదువుతున్న 7వ తరగతి విద్యార్థులకు డ్రోన్కు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించ దానికి సోమవారం ఒక వనూత్న ప్రోగ్రామ్ నిర్వహించఆరు. సాంకేతికత మీద ఆధారపడే ఈ సమాజంలో విద్యార్థులు తగు విధంగా సాంకేతిక అభివృద్ధిని పెంపొందించుకోవాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల అకడమిక్ డైరెక్టర్ పెనుగొండ సింధూజ పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రాం కోసం ఢిల్లీ నుండి టెక్ రేడియన్స్ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ స్వరూప్ రంజన్ తెలియజేశారు. డ్రోన్ కెమెరా నిర్మాణం, విడి భాగాలు, పనిచేయు విధానం, తయారీలో ఉపయోగించు పరికరాలు, తదితర విషయాలను వివరించి, ప్రాక్టికల్గా చూపించిన విధానంవిద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉత్సాహంగా హాజరై వారికి కలిగిన అనేక సందేహాలను నివృతిచేసి సమాధానాలను రాబట్టారని విద్యార్థులు ఈ కార్యక్రమం జరిగినంతసేపు అత్యంత ఆసక్తి, ఉత్సాహం కనబరిచారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయ సిబ్బంది, అకాడమిక్ ఇన్చార్జిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉభయ దేవాలయాలను దర్శించుకున్న

## ఢిల్లీ పోలీసు ఉన్నత స్థాయి అధికారి డాక్టర్ రామ్గోపాల్ నాయక్





**త్రిపురాంతకం, మార్చి 3, ప్రభాతవార్త**
త్రిపురాంతకం క్షేత్రంలోని శ్రీ పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి మరియు శ్రీమత్ బాల త్రిపుర సుందరీ దేవీ అమ్మవారి ఉభయ దేవాలయాలను ఢిల్లీకి చెందిన డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ రామ్ గోపాల్ నాయక్ సందర్శించి స్వామివార్లను దర్శించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ దేవాలయాల చరిత్రను అడిగి తెలుసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు స్వామివార్లను కొద్దిసేపు ధ్యానించుకొని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం అర్చకులు సాదారంగా ఆహానం పలికి పూజల అనంతరం దేవస్థానం శేషవస్త్రాలను బహుకరించి తీర్ధ ప్రసాదాలను అందించి ఆశీర్వదించారు.

## ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన బీజేపీ బృందం



**మార్కాపురం, మార్చి 3, ప్రభాతవార్త**
సబ్ కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సోమవారం బీజేపీ బృందం సందర్శించి పరిశీలించింది. సందర్భంగా బీజేపీ జాతీయ కౌన్సిల్ నెంబర్ శాసనాల సరోజిని వసతి గృహ విద్యార్థినుల తో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనేక మంది విద్యార్థులు అనారోగ్యం కారణంగా బాధపడుతున్నారని ప్రధానంగా కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ బెల్లకొండ లక్ష్మీతో మాట్లాడుతూ విద్యార్థులకునాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని, సంరక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, కాస్మోటిక్ మెనూ సక్రమంగా ఇవ్వాలని సూచించారు. త్వరలోనే వైద్య బృందంతో వచ్చి విద్యార్థులకు కంటి పరీక్షలు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మార్కాపురం అసెంబ్లీ ఇన్చార్జ్ టీవీకృష్ణారావు, ఎం.చిన్నయ్య, డాక్టర్ కిరణ్, పాదర్తి ఆంజనేయులు, మద్యల లక్ష్మీ, కామేశ్వరరావు, శివప్రసాద్, వాసవి, ప్రియ, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణపై వ్యాసరచన పోటీలు




**మార్కాపురం, మార్చి 3, ప్రభాతవార్త**
ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం పురస్కరించుకొని మార్కాపురం అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వన్య ప్రాణుల సంరక్షణ అంశంపై సోమవారం వ్యాసరచణ పోటీలను నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొని, అడవులు మన జాతీయ నిధి అని వాటిని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని అడవుల సంరక్షణ గురించి విద్యార్థులకు వివరించారు. మన నల్లమల అటవీ ప్రాంతంలో ఎన్నో వన్యప్రాణులు ఉన్నాయని వాటి మనుగడకు కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఛలో విజయవాడను జయప్రదం చేయండి



**మార్కాపురం, మార్చి 3, ప్రభాతవార్త**
ఆప్కాస్ రద్దును నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ ప్రైవేటు ఏజన్సీలకు మున్సిపల్ కార్మికులను అప్పచెప్పే విధానాలను మానుకోవాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలు ఇచ్చిన హామీ కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాలం జరిగిన ఒప్పందాలకు జీవోలు వెంటనే ఇవ్వాలని, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబరు 36 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులకు వర్తింపచేయాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం అధికారం వస్తే మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని చెప్పి, ఉన్న కొద్దిపాటి ఉద్యోగ భద్రతను ఆప్కాస్ను రద్దు చేస్తామని ప్రకటించడాన్ని ఆయన ఖండించాఉ. మున్సిపల్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5న ఛలో విజయవాడ మహాధర్నాకు పిలుపునివ్వడం జరిగిందని, మహాధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కే.సుబ్బరాయుడు, జి.హరి, సలాంఖాన్, ఎస్కే ఇమాంసా, యూసఫ్, చెన్నకేశవులుతదితరులు పాల్గొన్నారు.

## అర్ధవీడు ఈవోపీఆర్డీగా వీరరాజు



**అర్ధవీడు, మార్చి 3, ప్రభాతవార్త**
అర్ధవీడు మండలానికి చాలా రోజులుగా ఖాళీగా ఉన్నటువంటి ఈవోపీఆర్డీ పోస్టును నేడు భర్తీ చేశారు. ఈవోపీఆర్డీగా బాధ్యతలు చేపట్టిన కే.వీరరాజు, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం నుంచి అర్ధవీడు మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. మండలానికి సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు అందరూ బాధ్యతలు చేపట్టిన కే.వీరరాజుకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## బంగారు బాల్యంపై ప్రతిజ్ఞ.. కొవ్వొత్తుల ర్యాలీ



**సంతనూతలపాడు, మార్చి 3, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో సోమవారం నాడు ఐసిడీఎస్ ఆధ్వర్యంలో బంగారు బాల్యంపై కొవొత్తుల ర్యాలీ, ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 8న జరిగే మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు పి.నాగలక్ష్మీ, ఆర్.పార్వతి బాయ్, వెలుగు ఏపీఎం టి.బాబురావు, సీసీలు శ్రీనివాసులు, రామాంజనేయులు, ఈవోఆర్డీ డి.ఎం.రమణమ్మ, మండల పరిషత్ ఏవో ఈదర విజయలక్ష్మీ, ఎన్ఆర్ఈజీఎస్ మండల ఏపీవో వాసంతి, మండల పరిషత్, వెలుగు ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. మద్దిపాడు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్ ఇవాంజిలిన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## యూనివర్సిటీకి నిధులు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



**సంతనూతలపాడు, మార్చి 3, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ను సవరించి ఆంధ్రకేసరి యూనివర్సిటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని, వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు రూపాయలు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు డిమాండ్ చేశారు .సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను సవరించాలని కోరుతూ సోమవారం బడ్జెట్ ప్రతిపాదనలను సవరించాలని కోరుతూ సోమవారం నాడు జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 3.22 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఇది కార్పొరేటర్లకు అనుకూలంగా ఉందని అన్నారు. బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకాశం జిల్లాను విస్మరించిందని సీపీఎం జిల్లా నేత బంకా సుబ్బారావు విమర్శించారు. వెనుకబడ్డ ప్రకాశం జిల్లా అభివృద్ధికి పది వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆంధ్రకేసరి యూనివర్సిటీకి 100 ఎకరాలు కేటాయించినా అయితే భవన నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడం మరింత దారుణమని ఆయన ఆరోపించారు. పేర్నమిట్టలో నేటి వరకు యూనివర్సిటీ నందులో క్లాసులు ప్రారంభం కాలేదని, వెంటనే 50 కోట్ల రూపాయలు కేటాయించి భవన నిర్మాణాలు ప్రారంభించి క్లాసులు ప్రారంభింపచేయాలని ఆయన కోరారు. పశ్చిమ ప్రాంత ప్రజల ఆశా జ్యోతి వెలిగొండ ప్రాజెక్టు ఎన్నిలక హామీగా మాత్రమే కొనసాగుతుందని విమర్శించారు. 30 సంవత్సరాల నాడు ప్రారంభించిన వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయడంలో ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని అన్నారు. ప్రాజెక్టు పూర్తి కావలంటే 4000 కోట్లు అవసరం. ఈ బడ్జెట్లో 2000 కోట్లు కేటాయిస్తేనే మొదటి స్వరంగం నుండి నీళ్లు రావటానికి అవకాశం ఉంది. కానీ 309 కోట్లు కేటాయించి ప్రజల కళ్ల నీళ్లు తుడవడానికి ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంలో ప్రజలకు, మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను ఈ బడ్జెట్లో విస్మరించారని ఆయన అన్నారు. వెంటనే ఆర్టీసీ ఉచిత బస్సు ప్రారంభించాలని, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ.1500లు ఇవ్వాలని, నిరుద్యోగ బృతితికి ఈ బడ్జెట్లోనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరల స్థిరీకరణ నిధి రూ.300 కోట్లు కేటాయించారు. ఇవి వ్యవసాయ రంగాన్ని కాపాడటానికి సరిపోవని 3000 కోట్లకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి అన్ను వెంకట సుబ్బారావు, సీపీఎం నాయకులు దాసరి చిన్నబాబు, ఉంగరాల రామకృష్ణ, తుళ్లూరు సుబ్బారావు, కోదూరిరామకృష్ణారెడ్డి, పొత్తూరి చిన్నశేషయ్య, కైలాఅవినాష్, లక్కుతిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈ పంట నమోదుపై వ్యవసాయ ప్రతినిధులతో సమీక్ష



**సంతనూతలపాడు, మార్చి 3, ప్రభాతవార్త**
సంతనూతలపాడు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ నందు సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల వ్యవసాయ సిబ్బంది, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమీక్ష సమావేశం ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్బాబు మాట్లాడుతూ ముఖ్యంగా రబీ సీజన్లో పొలం సాగు చేసేవారు ఇంకా ఈ పంట నమోదు, ఈకేవైసీ పూర్తి కాకుండా మిగిలి ఉన్న రైతులకు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పంట కోత ప్రయోగాలు సకాలంలో జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా రైతు వారి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ముందుగా భూ యజమానులు, భూ రికార్డులు సరిగా ఉన్న రైతులను గుర్తించి వారికి వెంటనే రైతు వారి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని తెలిపారు. పీఎం కిసాన్ సంబంధించిన ఈకేవైసీ, రైతు స్వతహాగా చేసుకున్న రిజిస్ట్రేషన్లు పరిశీలించి వాటిని కూడా పూర్తి చేయాలని తెలియజేశారు. రైతు సేవ కేంద్రం పరిధిలో ఉన్న రైతులకు భూసార పరీక్ష యొక్క ఆవశ్యకత, ఉపయోగాలు గురించి అవగాహన కల్పించి మట్టి నామూనాలను తీయు విధానం గురించి వివరించి, తీసిన మట్టి నమూనాలను బూసార పరీక్ష కేంద్రం, ఒంగోలునకు చేర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు, చీమకుర్తి మండల వ్యవసాయాధికారులు పి.పావని, డీవీ.భాస్కర్, వ్యవసాయవిస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కేవీ సుబ్బారెడ్డి, పి.వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## పేర్నమిట్టలో ర్యాలీ, ప్రతిజ్ఞ, మొక్కలు పెంపకం



**సంతనూతలపాడు, మార్చి 3, ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట 42వ డివిజన్ శాంతి నగర్ నందు సోమవారం నాడు ఐసీడీఎస్ పేర్నమిట్ట సెక్టార్ సూపర్వైజర్ రమా ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రతిజ్ఞ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరస్వతి, మహిళా పోలీసు సింగమ్మ, అంగన్వాడీ టీచర్లు రమా, కామేశ్వరి, తల్లులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్దిపాడు పీహెచ్సీ నందు ఆకస్మిక తనిఖీలు



**మద్దిపాడు, మార్చి 3, ప్రభాతవార్త**
జాతీయ వ్యాధి నిరోధక కార్యక్రమాలు గురించి అందరికి అవగాహన కల్పిస్తూ, ముఖ్యంగా టీబీ సస్పెక్టెడ్ కేసులను ఐడెంటిపై చేసి 2030 కల్లా టీబీ రహిత భారతదేశంగా టీబీ ముక్త భారత్గా అభివృద్ధి చేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ బి.శ్రీవాణి పేర్కొన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీల్లో భాగంగా పీహెచ్సీ పరిధిలో టీబీ రికార్డ్స్, రిపోర్ట్, లెప్రసీ రికార్డ్సు అండ్ రిపోర్ట్స్ ఎయిడ్స్ సంబంధించిన రికార్డ్స్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామాల్లో ఉన్న ప్రజలకు వ్యాధి నిరోధక కార్యక్రమాలను గురించి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. టీబీ సస్పెక్టెడ్ కేసులను ఐడెంటిపై చేసి 2030 కల్లా టీబీ రహిత భారతదేశంగా టీబీ ముక్తభారత్గా అభివృద్ధి చెందాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద మోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**సంతమాగులూరు, మార్చి 3, ప్రభాతవార్త**
సంతమాగులూరు సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ సమావేశం హాల్లో మండల అధ్యక్షుడు ఎనుబార్ల యలమంద అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.జ్యోతిర్మయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని గ్రామ సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొనాలని తెలియజేశారు.

## పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే బూచేపల్లి



**తాళ్లూరు, మార్చి 3, ప్రభాతవార్త**
మండలంలోని మన్నేపల్లి పంచాయతీ పరిధిలోని దారంవారి పాలెంలో ఎస్సీ కాలనీకి చెందిన ఎం.ఆంజనేయులు ఇటీవల కాలంలో పొగాకు బ్యార్నీ ఆకును సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు గాయపడ గా అతన్ని జిల్లా వైకాపా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్రెడ్డి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ పార్టీ నాయకులు మంచాల నారపురెడ్డి, మారం రామిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఎల్లప్పుడూ అన్ని విధాలుగా వారి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తూము వెంకట సుబ్బారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, వైస్ ఎంపీపీ మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, సర్పంచ్ మంచాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కుమ్మిత జయరామిరెడ్డి, కైపు అశోక్రెడ్డి, సంగు కొండారెడ్డి, వలీసారెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీమార్కండేశ్వరస్వామి రథోత్సవం



**మార్కాపురం, మార్చి 3 ,ప్రభాతవార్త**
శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి వారి రథోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి పర్యవేక్షణలో రథోత్సవ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంత్రోచ్చరణల మధ్య దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కూర్చోపెట్టి పుర వీధుల గుండా నగరోత్సవం జరిపారు. స్వామివారి దర్శనం కోసం పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. శివ నామ స్మరణ తో మార్కాపురం పట్టణం మార్మోగింది.



## మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి - సిఐ ప్రభాకర్



**యర్రగొండపాలెం,మార్చి 3,ప్రభాతవార్త**
విద్యార్థి దశలోనే బాలికా, మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని యర్రగొండపాలెం సిఐ ప్రభాకర్ అన్నారు. సోమవారం యర్రగొండపాలెం పట్టణంలోని కసూర్బి పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జరిగే ప్రత్యేకమైన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ తిరుమలదేవి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా సిఐ హజరైనారు. ఈ సందర్భంగా సిఐ ప్రభాకర్ మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, మహిళలు, యువతలు, చిన్నారుల రక్షణకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కల్పించారు. గృహహింస, వరకట్న వేదింపులు, లైంగికదాడులు, అక్రమ రవాణా, పనిప్రదేశాల్లో లైగింక వేదింపులు, బాల్యవివాహాలు నిషేధం, అలాగే మహిళా హెల్ప్లైన్ 181, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెబరు 1930, పోలీసు 100, చైల్డ్ హెల్ప్లైన్ 1098, ఒన్నేషన్ ఒన్ నెంబర్112, హెల్ప్ లైన్ నెంబర్లు గురించి వివరించారు. ఇల్లాలి చదవుఇంటికి వెలుగు అని బంగారు బాల్యం కార్యక్రమంలో 0-18 సంవత్సరాలలోపు బాలికలందరూ చదువుకోవాలని ప్రిన్సిపల్ తిరుమలదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని బాలికలు పాల్గొన్నారు. అనంతరం యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**యర్రగొండపాలెం,మార్చి 3,ప్రభాతవార్త**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మార్చి 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యర్రగొండపాలెం పట్టణంలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వాహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ ఎ.పద్మజ మహిళా దినోత్సవ వేడుకల విశిష్టత గురించి తెలియజేశారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలతో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదం డ్రులు పాల్గొన్నారు.

## బెట్టింగ్ బుకీలా వేటలో పోలీసులు

### - ఎప్పుడు ఎవరిని ఎత్తుతారో అని బిక్కు బిక్కుమంటున్న బెట్టింగ్ ముఠా

### - పరారిలో కొంత మంది బుకెలు

**సింగరాయకొండ,మార్చి 3,ప్రభాతవార్త**
ఈ నెలలో ఐ.పి.ఎల్ సీజన్ మొదలు కావడంతో క్రికెట్ బెట్టింగ్ ప్రధాన బుకీల కోసం గాలింపు వేటను పోలీసులు ముమ్మరం చేసారు. కొండపి నియోజకవర్గం సింగరాయకొండ సర్కిల్ పరిధిలో చేపట్టిన ప్రత్యేక చర్యలతో క్రికెట్ బెట్టింగ్ సామ్రాజ్యంలో వణుకు పుడుతోంది. గత రెండు రోజులు నుండి జిల్లా పోలీస్లు చేపట్టిన చర్యలు, నిఘా, విచారణతో బెంబేలెతున్నారు. జరుగుమల్లి మండలంలో చోటు చేసుకున్న సంఘటనతో ఒక కుటుంబం జిల్లా ఎస్పీ దామోదర్ని కలిసి తమ కుటుంబం గోదు వెళ్లబోసుకున్నారు. తమ కుటుంబంలా ఇక ఏ కుటుంబం చితికి పోకుండా కాపాడాలని బెట్టింగ్ ముఠా ఆట కట్టించేందుకు చర్యలు తీసుకోవాలని కోరడం తో జిల్లా పోలీస్ యంత్రాంగం స్వయంగా రంగంలోకి దిగింది. జిల్లా ఎస్పీ దామోదర్ స్వీయ పర్యవేక్షణలో పోలీస్లు జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల కేంద్రంగా గత కొన్ని సంవత్సరాలుగా క్రికెట్ బెట్టింగ్ సామ్రాజ్యం నిర్వహిస్తున్న వారి తోపాటు బుకీలు, దందా రాయుళ్ళ భరతం పట్టేందుకు ప్రత్యేకంగా నిఘా పెట్టారు. గత వారం రోజులుగా పోలీస్ ల వద్ద ఉన్న సమాచారంతో తీగ లాగితే డొంకంతా కదిలినట్లు ఇప్పటికి పదుల సంఖ్యలో బెట్టింగ్ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పోలీస్ అదుపులో ఉన్న బుకీలు, బుకింగ్ ముఠా సభ్యుల నుండి సేకరించిన సమాచారంతో ప్రధాన మూల స్థంభాలును అదుపులోకి తీసుకుని విచారణ చేసేందుకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భావించి వేట ముమ్మరం చేశారు. ఈ బెట్టింగ్ ముఠాకి అధికార, ప్రతి పక్ష రాజకీయ నాయకులు పార్టీల అండదండలు పుష్కలంగా ఉండడంతో పోలీస్ చర్యలు ఏమేరకు సత్ఫలితాలు ఇస్తాయి అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**పెద్దదోర్నాల, మార్చి 3, ప్రభాతవార్త**
జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పెద్దదోర్నాల ఎస్సై వి.మహేష్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7,8,9వ తరగతుల విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వివి రమణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతుల కష్టం తెలిసిన వ్యక్తి పొగాకు బోర్డు ఈడి అద్దంకి శ్రీధర్ బాబు

### - రైతుల ఆనందమే మన ఆనందంగా భావించిన వ్యక్తి శ్రీధర్ బాబు



**కొండపి, మార్చి 3 ,ప్రభాతవార్త**
రైతుల కష్టం గురించి తెలిసిన వ్యక్తి పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు అని పొగాకు బోర్డు రైతులు, రైతు నాయకులు తెలిపారు. సోమవారం కొండేపి పొగాకు బోర్డును పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు ఐఏఎస్ పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఈడి, పొగాకు బోర్డు సిబ్బందితో కలిసి పొగాకు బోర్డు ప్రాంగాణంలో ఒక మొక్కను నాటి పర్యావరణ ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. పొగాకు బోర్డు అధికారులతో అంతర్గత సమావేశం నిర్వహించి రాబోయే 2025 వేలం సీజన్కు సంబంధించి పనులు మరియు సంసిద్ధతను గురించి తెలుసుకోవడం జరిగింది. వివిధ గ్రామాల పొగాకు రైతులు అందరూ కలిసి పొగాకు బోర్డు ఆవరణలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పొగాకు బోర్డు గుంటూరు అద్దంకి శ్రీధర్ బాబు ఐఏఎస్ పదోన్నతిపై వేరే కార్యాలయానికి బదిలీ అయిన సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని పొగాకు బోర్డు ఆవరణలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

#### పొగాకు బోర్డు ఈడి శ్రీధర్బాబు సేవలను కొనియాడిన రైతు నాయకులు

ఈ సందర్భంగా రైతు నాయకులు అందరూ మాట్లాడుతూ బదిలీపై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పొగాకు బోర్డులో రైతులకు 7సంవత్సరముల నుండి చేసినటువంటి సేవలను గురించి కొనియాడారు. గత మూడు సంవత్సరాల నుంచి పొగాకు రైతులు అమ్మి అనధికార పొగాకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా చేసి రైతుల కళ్ళల్లో ఆనందం నింపిన వ్యక్తి ఈడి అని అన్నారు. గతంలో పొగాకు రైతులు అమ్మిన బేళ్ళను 14రోజులలో రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగేదని ఈడి దానికి 9రోజులకే కుదించడం జరిగిందన్నారు. గత సంవత్సరంలో 17.5మిలియన్ల పొగాకు కొండపి వేలం కేంద్రంలో అమ్మకాలు జరిపారని కానీ ఎక్కువ రోజులు వేలం నిర్వహించడం వలన రైతుల దగ్గర ఉండే పొగాకు నాణ్యత లోపిస్తుందని అన్నారు. కాబట్టి ఈ సంవత్సరం కూడా సుమారు 19మిలియన్ల పొగాకు రైతుల దగ్గర ఉన్నట్లు గుర్తించడం జరిగిందని గత ఏడాది ఈ సంవత్సరం ఎక్కువ రోజులు వేలంలో కొనుగోల్లు పడతాయని అన్నారు. రైతులు దీనిని దృష్టిలో ఉంచుకొని చుట్టుప్రక్కల ఉన్న కనిగిరి, పొదిలి పొగాకు బోర్డులో తక్కువ మిలియన్లు పొగాకు అమ్మకాలు జరుగుతున్నాయని ఏ ఊరు రైతులు మేము దగ్గరలో ఉన్న పొగాకు బోర్డులో అమ్మకాలు జరుపుకుంటామని వేలం నిర్వహణాధికారి తెలియజేయవచ్చునని తెలిపారు. అద్దంకి శ్రీధర్ బాబుకు పుష్పగుచ్ఛాలు, శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించడం జరిగింది. పొగాకు బోర్డు వైస్ ఛైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, ఒంగోలు ఆర్ఎం లక్ష్మణరావు, గుంటూరు వేలం నిర్వహణాధికారి కె రామాంజనేయులు, రైతు నాయకులు రైతులు పాల్గొన్నారు.

# దేవాలయం నిర్మాణమునకు భూమి పూజ



**దొనకొండ,మార్చి 3,ప్రభాతవార్త**
దొనకొండ కనకదుర్గమ్మ దేవాలయం దగ్గర వేంచేసి ఉన్న ప్రత్యక్ష నాగమ్మ తల్లి దేవాలయం పునర్నిర్మాణము చేయుటకు ఎర్రబాలెం గ్రామం నివాసి ముచ్చు చిన అంకయ్య రోజమ్మల కుమారుడు ముచ్చు వెంకటరమణ వారి ధర్మపత్ని సుజాత గత 20 సంవత్సరముల నుండి ఇక్కడ దేవాలయం నిర్మాణం చేయాలని మొక్కుకొనగా ఆ తల్లి అనుగ్రహం వలన ఈ రోజున సుమారు 60 లక్షల రూపాయలతో దేవాలయం నిర్మాణమునకు భూమి పూజ నిర్వహించారు సోమవారం ఉదయం ఐదు గంటల నుండి కడప జిల్లా బద్వేల్ వేద పండితులు హోమాలు నిర్వహించి పూజా కార్యక్రమాలు చేశారు ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజలంతా అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకొని అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు

# ఘనంగా భగవాన్ జన్మదిన వేడుకలు

## - వేడుకలలో పాల్గొన్న భగవాన్ అమ్మ శిష్యురాలు సౌజన్య దాసాజీ



**ఒంగోలు కల్చరల్ మార్చి 3, (ప్రభాతవార్త)**
శ్రీ పరంజ్యోతి కల్కి ఆలయం మద్దిపాడు లో శ్రీ భగవాన్ జన్మదిన వేడుకలు సోమవారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మ భగవాన్ శిష్యురాలైన సౌజన్య దాసాజీ వారిని మంగళ వాయిద్యాలతో అర్చకులు వేదమంత్రాలతో పూర్ణకంభంతో వారి శిష్యులు భగవాన్ ఆలయంలోకి ఘన స్వాగతం పలికారు. భగవాన్ ఆలయంలో సౌజన్య దాసాజీ మహా పాదుకాభిషేకం వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో పూజా క్రతువుల నిర్వహించారు. అనంతరం సౌజన్య దాసాజీ ఆమె మాట్లాడుతూ శ్రీ పరంజ్యోతి అమ్మ భగవాన్ మహా పాదుకాభిషేకం లో పాల్గొన్న భక్తులకు ఐశ్వర్యాన్ని, ఆరోగ్యాన్ని, బాంధవ్యాల పట్ల ప్రేమ కృతజ్ఞతను సమవృద్ధిని శ్రీ పరంజ్యోతి అనుగ్రహంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క భక్తులకు శ్రీ పరంజ్యోతి అమ్మ భగవాన్ మీ మనసులో ఉన్న మనోభీష్టాన్ని,మీ సంకల్పాన్ని నెరవేర్చాలని అమ్మఆశీస్సులు అందరికీ ఉండాలని ఆమె తెలిపారు. సౌజన్య దాసాజీ వారి సహస్థాలతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తేజస్విని, కళ్యాణ్ శేషగిరి, కుమారి, అలేఖ్య,చంద్రశేఖర్,సాంబశివరావు, శ్రీలక్ష్మీ, అనురాధ,ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతంగా జయప్రదం చేశారు. సాయంత్రం భగవాన్ జన్మదినం సందర్భంగా ఆలయంలో నలుమూలల నుండి వచ్చిన భక్తుల చేత కేక్ కటింగ్ ఘనంగా నిర్వహించారు.

# దాతల సహకారం అభినందనీయం

## - ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు



**రాచర్ల, మార్చి 3 ,ప్రభాతవార్త**
విద్యార్థులకు దాతల సహకారం అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు ఎంవి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని చోళ్ళవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి అద్దంకి మౌలాలి పరీక్ష అట్టలు బహుకరించగా ఆయన వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష సమయంలో దాతలు విద్యార్థులకు అట్టలు అందజేయడం మంచి కార్యక్రమమని ఈ సందర్భంగా వారిని తమ పాఠశాల తరపున అభినందిస్తున్నామన్నారు. ఈనెల 17వ తేదీ 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని విద్యార్థులు పరీక్షలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధన కొరకు ఇప్పటి నుండే విద్యార్థులు కష్టపడి బాగా చదువుకోవాలని పరీక్షలు చక్కగా రాసి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఉత్తమ చదువులకు ఉద్యోగ అవకాశాలకు పదవ తరగతి మార్కులే ప్రామాణికమని ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. కాబట్టి ప్రతి విద్యార్థి కష్టపడి ఇష్టంతో చదువుకొని నూరుశాతం ఫలితాలు సాధించాలని, 10/10 సాధనే ధ్యేయంగా పరీక్షలు రాయాలన్నారు. మంచి ఫలితాల ద్వారా పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ఇందిరా స్వచ్ఛంధ సేవాసంస్థ అధ్యక్షులు శ్రీం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో యువకుడు మృతి





**రాచర్ల, మార్చి 3, ప్రభాతవార్త**
అనారోగ్యంతో యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన రాచర్లలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన పందిళ్ళపల్లి సురేష్ (30) అను యువకుడు గత కొంతకాలంగా లివర్ కామెర్లతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. వివిధ ప్రాంతాలలో చికిత్సలు చేయించినప్పటికీ వ్యాధి అనుకున్న స్థాయిలో నయం కాలేదు. వ్యాధి తీవ్రత ఎక్కువై తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం చికిత్సల నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్ళారు. వైద్యశాలలో చికిత్సలు చేయిస్తుండగానే సురేష్ మృతిచెందాడు. మృతుడు సురేష్‌కు తండ్రి వెంకటేశ్వర్లు, తల్లి నారాయణమ్మతోపాటు భార్య శ్రావణి, వెంకట కావ్య, చైతన్య అను కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

## వాగు పోరంబోకు భూముల జోలికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

### - తహశీల్దార్ చిరంజీవి



**మార్కాపురం రూరల్, మార్చి 3, ప్రభాతవార్త**
మండలంలోని వేములకోట గ్రామం నందు 2024 డిసెంబర్ 24వ తేదీన జరిగిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో భాగంగా వేములకోట గ్రామస్తులు సర్వే నెంబర్ 982 నందు 101.69 ఎకరాల వాగు పోరంబోకు భూమి కలదని, అయితే సదరు భూమి ఆక్రమణ జరిగిందని పశువులకు మేత బీడుగా ఉపయోగపడేలా చేసి ఆక్రమణలు తొలగించామని అర్జీ దాఖలు చేయడం జరిగింది. తహశిల్దార్ కె చిరంజీవి వాగు పోరంబోకులోని సుమారు 32ఎకరములు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించి, ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చట్టప్రకారం తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నారు. భూమి విలువ రూ.3.20కోట్లు ఉంటుందని తెలిపారు. వాగు పోరంబోకులోని ఎవరైనా ప్రవేశించిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

## గోగులదిన్నె గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమం



**మార్కాపురం రూరల్, మార్చి 3, ప్రభాతవార్త**
అంతర్జాతీయమహిళా దినోత్సవ వారోత్సవాల వేడుకలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 1 నుండి మార్చి 8వ తేదీ వరకు కార్యమ్రాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా సోమవారం మర్కాపురం మండలంలోని గోగులదిన్నె గ్రామంలో బాల్యవివాహాల నిర్మూళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సెక్టార్ సూపర్‌వైజర్ పి లలిత సలోమి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను కలిపి సంతకాలసేకరణ, మొక్కలు నాటడం, బాల్య వివాహాలు నిర్మూలించాలని తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించుట లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్ద శ్రీను, ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం ఎస్ సునీత, ఎంఎస్‌కె భాగ్యలక్ష్మీ, అంగన్ వాడీ కార్యకర్తలు టి మల్లేశ్వరి, ఆర్ పార్వతి, కె లలితమ్మ, ఆయాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికట్లలో ప్రత్యేక పారిశుధ్య పనులు

**కొనకనమిట్ల, మార్చి 3, ప్రభాతవార్త**
మండలంలోని చిన్నారికట్ల గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా రహదారుల పక్కన ఉన్న చెత్తను దిబ్బలను సోమవారం తొలగించే పనులను చేపట్టారు. జేసీబీ ద్వారా రోడ్డు పక్కన ఉన్న ఎరువు దిబ్బలను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన మండల ఈవోపీఆర్) ఆర్డీవో శ్రీదేవి మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయరాదని, ఎల్ల ముందు మురుగు నీరు నిల్వ లేకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మురుగు కాలువల్లో చెత్త, చెదారాన్ని వేయకుండా చూడాలని సర్పంచ్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సర్పంచ్ గోసుల అనురాధ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికలను సంరక్షిద్దాం .. బాలిక విద్యకు ప్రాముఖ్యతనిద్దాం ..

## - సిడిపిఓ నీలోఫర్




**కంభంరూరల్, మార్చి 3, ప్రభాతవార్త**
బాలికల సంరక్షణకు సంకల్పించాలని, బాలికా విద్యకు ప్రాముఖ్యతనివ్వాలని సిడిపిఓ నీలోఫర్ వ్యాఖ్యానించారు. సోమవారం స్థానిక గురుకుల పాఠశాలలో అంతార్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని బాల్య వివాహాల నిర్మూళన, బాలికావిద్య, బాలికల సంరక్షణ అంశాలపై అవగాహన కలిగించి, సంతకాల సేకరణ, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బాలికలందరూ ప్రతిఒక్కరు ఓ మొక్క నాటి సంరక్షణ బాధ్యతలను చేపట్టేలా అవగాహన కలిగిస్తూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సమానత్వం, సహృద్భావనలను వివరిస్తూ పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారతకు శ్రీకారం చుట్టారు. బాల్య వివాహాల దుష్పరిణామాలను, బాలికా విద్య ఆవశ్యకతను విద్యార్థినీలకు వివరించి చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల విద్యార్థినీలు, ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు నాగచెంచులక్ష్మీ, అంగన్ వాడీ కార్యకర్తలు శ్రీదేవీ, ఫాతిమా, లక్ష్మీ, సాహెర, గురుకుల పాఠశాల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొండను తవ్వారు.. ఎలుకను పట్టారు

## - సామాజిక తనిఖీ నివేదికలపై మరో మారు తనిఖీ

వార్త ప్రభావం

**బల్లికురవ, మార్చి 3, ప్రభాతవార్త**
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో సామాజిక తనిఖీలలో నామమాత్రంగా వెలుగు చూసిన అవినీతిని నిగ్గు తేల్చేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన అధికార యంత్రాంగం సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణ కొనసాగించారు. ఎంపీడీఓ కుసుమకుమారిని సైతం తాము తనిఖీ చేసే సమయంలో బయటకు పంపారు. సామాజిక తనిఖీలలోని పారదర్శకత ఎంత అంటూ జనం వేలెత్తి చూపుతున్న తరుణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ పత్రికలలో పతాక శీర్షిక వార్తలు వచ్చిన నేపథ్యంలో మరో మారు అధికార యంత్రాంగం సామాజిక తనిఖీ నివేదికలను పరిశీలిస్తున్నారు. సామాజిక బృందాలు తనిఖీలు పేరిట రిపోర్టులు తయారు చేస్తూ అవినీతికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఫలితంగా సామాజిక తనిఖీలు,ప్రజావేదికలు, అంధమైన పదాలుగానే మిగిలిపోతున్నాయి. వివరాల్లో వెళ్తే.. మండలంలోని 21 పంచాయతీలలో 1.4.2023 నుండి , 31.03.2024 వరకు రూ.13 కోట్ల విలువైన, ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఈ పనుల్లో అవినీతి అంతులేకుండా కొనసాగింది. వీరి అవినీతి అలా సాగిందో ఉదాహరణకు కొన్ని, ముక్తేశ్వరం మరికొన్ని గ్రామాలలో కూలీల సంతకాలు లేకుండానే చెల్లింపులు జరిగాయి. కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారికి సైతం నెలలు తరబడి మస్టర్ వేశారు. మల్లాయపాలెం గ్రామంలో భవనాలు కట్టకుండానే బిల్లులు డ్రా చేశారు. అదే విధంగా కే.రాజుపాలెంలో ఎం.బుక్‌తో పని లేకుండా చెల్లింపులు జరిపారు. కొప్పెరపాడు గ్రామంలో వాలంటీర్లకు నెలలు తరబడి మస్టర్ వేసి దిగమించేశారు. హార్టికల్చర్ పేరుతో ఒక్క మొక్క కూడా లేకుండా ఎన్నో గ్రామాలలో నిధులు డ్రా చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే గ్రామ గ్రామాన అవినీతి అనకొండ మాదిరిగా పెరుగుతూ పోయింది. సామాజికి తనిఖీల ద్వారా, ప్రజా వేదికలో పెరుగుతూ పోయింది. సామాజిక తనిఖీల ద్వారా, ప్రజా వేదికలో మూడు రోజులు అధికారులు తెగ కష్టపడి తేల్చేసింది. కేవలం ఎనిమిది లక్షల అవినీతి, దీనిపై తీవ్రమైన విమర్శలు రావడం తో పాటు తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో మరోమారు జిల్లా కేంద్రమైన బాపట్ల నుండి అధికారులు విచ్చేశారు. తమ తనిఖీలలో గుర్తించిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేస్తామని వారు వివరించారు.

# 8న కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభం

**బల్లికురవ, మార్చి 3, ప్రభాతవార్త**
ఈనెల 8వ తేదీన జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కుట్టు శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి తెలియజేశారు. బీసీ, ఈడబ్ల్యూసీ, ఈబీసీ, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, కులాలకు సంబంధించిన మహిళలు శిక్షణ కేంద్రంలో కానీ, ఎంపీడీఓ కార్యాలయంలో కానీ, సచివాలయంలో కానీ తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 18 నుండి 45 సంవత్సరాల లోపు, వయసు కలిగిన మహిళల పేర్లను నమోదు చేసుకోవాలని, 90 రోజుల శిక్షణ కార్యక్రమం అనంతరం కుట్టు మిషన్ కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఐడియాథోన్ ఓరల్ ప్రెజెంటేషన్ విభాగంలో

## ప్రతిభ కనబరచిన జార్జి ఫార్మసి విద్యార్థినీలు



**మార్కాపురంరూరల్, మార్చి 3 ,ప్రభాతవార్త**
స్థానిక జార్జి ఫార్మసీ కళాశాల నందు తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీలు ఎం యాస్మిన్ భేగం, టి.యశోదలక్ష్మీ, ఎస్‌కె ఆసిఫా, బి కాత్యాయనిలు ఫిబ్రవరి 28వ తేదీన గుంటూరు చలపతి ఫార్మసీ కళాశాలవారు నిర్వహించిన నేషనల్ సైన్స్‌డే సందర్భంగా నిర్వహించిన ఐడియాథోన్ నందు టాప్ టెన్‌లో ఓరల్ ప్రెజెంటేషన్ విభాగంలో ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై రాజా జయరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల డాక్టర్ ఆదిమూలపు సతీష్ విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## బద్దీటి వారి వివాహ వేడుకలో పాల్గొన్న బిజేపి నాయకులు



**గిద్దలూరు, మార్చి 3, ప్రభాతవార్త**
కొమరోలు మండలంలోని ఎడమకల్లు లో జరిగిన బద్దేటి వారి వివాహ వేడుకలో భారతీయ జనతాపార్టీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, భారతీయ జనతాపార్టీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, బద్వేల్ ఎమ్మెల్యే కమలమ్మ, ఆమె భర్త ప్రభాకర్, గిద్దలూరు వార్త ప్రతినిధి రమేష్‌లు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బద్దీటి కుటుంబ సభ్యులు వారికి స్వాగతం పలికారు. నూతన వధువరులను సుఖ సంతోషాలతో కలిసి సంసార జీవితం గడపాలని, అంతే కాకుండా ఆ భగవంతుడు అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సంపూర్ణంగా ప్రసాదించాలని కోరుతూ ఆశీర్వదించారు.

# వైభవంగా జీవనమూర్తి స్వామి 16 రోజుల పండుగ





**రాచర్ల, మార్చి 3, ప్రభాతవార్త**
మండలంలోని అనుములపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ జీవనమూర్తి స్వామి 16రోజుల పండుగ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ పెద్దలు, గ్రామ ప్రజలు 16రోజుల పండుగ విజయవంతానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. గత ఫిబ్రవరి 16వ తేదీన శ్రీజీవన మూర్తి స్వామి జెండా మహోత్సవ కార్యక్రమం జరిగిన విషయం విధితమే. జెండా మహోత్సవం పూర్తయిన 16రోజులకు గ్రామంలో 16రోజుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. గ్రామ ప్రజలు గ్రామ పరిసర ప్రాంత ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామమంతా ప్రజలతో కోలాహలంగా మారింది. 16రోజుల పండుగ సందర్భంగా గ్రామంలో బండలాగుడు పోటీలు, కోలాటం, పాటకచేరి, తదితర కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు, ప్రజలకు నిర్వాహకులు ఆహ్లాదం కలిగించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ఉదయం 11గంటల నుండి రాత్రి 10గంటల వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి జెండా మహోత్సవం మరియు 16రోజుల పండుగ కార్యక్రమాల విజయవంతానికి సహకరించిన ప్రజలందరి ఆలయ పెద్దలు కార్యనిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. 16రోజుల పండుగ సందర్భంగా ఎలాంటి గొడవలు తలెత్తకుండా రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

# 80 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

**మార్టూరు, మార్చి 3, ప్రభాతవార్త**
మార్టూరు సివిల్ సప్లై రెవెన్యూ అధికారి ఏ.అబ్రహం రెవెన్యూ అధికారులు, మార్టూరు పోలీసులతో కలిసి అక్రమంగా గూడ్స్ ఆటోలో తరలిస్తున్న 80 బస్తాలరేషన్ బియ్యాన్ని సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. రేషన్ బియ్యంతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని బియ్యాన్నా భద్రత నిమిత్తం శ్రీలక్ష్మి సివిల్ సప్లై రైస్ మిల్, వలపర్ల వారికి అప్పగించారు. అక్రమంగా బియ్యంను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను, ఆటోను మార్టూరు పోలీసు స్టేషన్‌లో అప్పగించి సివిల్ సప్లై రెవెన్యూ అధికారి అబ్రహం తెలిపారు.

## జీవనమూర్తి స్వామి ఆలయంలో కృష్ణకిశోర్ రెడ్డి ప్రత్యేక పూజలు



**రాచర్ల, మార్చి 3, ప్రభాతవార్త**
మండలంలోని అనుములపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ జీవనమూర్తి స్వామి ఆలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి ఆయన చేత పూజలు చేయించి స్వామివారి తీర్థప్రసాదాన్ని అందజేశారు. ఈ జీవనమూర్తి స్వామి జెండా మహోత్సవ కార్యక్రమం 16రోజుల పండుగ సందర్భంగా గ్రామంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కిశోర్ రెడ్డికి మండల మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం స్థానిక నాయకులు ఆయననుశాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, మండల మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కుప్పా రంగసాయి, తెలుగుదేశం నాయకులు గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, పఠాన్ సనావుల్లా ఖాన్, యామా సంజయ్, శిరిగిరి వెంకటపతి, దప్పిలి కాశిరెడ్డి, బత్తిని రామకృష్ణ, పుట్ట బాలకృష్ణ, కరిపిరెడ్డి శివారెడ్డి, బూపని కాశయ్య, గోపవరం పాండురంగారెడ్డి, శిరిగిరి హరి, స్థానిక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధిభైరవేశ్వరాలయంలో మాజీ ఎమ్మెల్యే “అన్నా” దంపతుల ప్రత్యేక పూజలు



**రాచర్ల, మార్చి 3, ప్రభాతవార్త**
మండలంలోని రామాపురం గ్రామ సమీపంలో వెలసియున్న శ్రీ సిద్ధిభైరవేశ్వరాలయంలో గిద్దలూరు మాజీ శాసనభ్యులు, మార్కాపురం వైఎస్సార్‌సీపి సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు ఆయన సతీమణి దుర్గాకుమారి దంపతులు సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి పర్వదినం అనంతరం వచ్చిన మొదటి సోమవారం సందర్భంగా వారు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు శైవగామ నియమానుసారం వారి చేత అభిషేకాది పూజలు చేయించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాంబాబు దుర్గాకుమారి దంపతులకు ఆలయ ధర్మకర్త మదిరె శ్రీరాంగారెడ్డి, ఉపధర్మకర్త శ్రీరంగపు వెంకట నారాయణ రెడ్డి ఆలయ పెద్దలు అన్నపురెడ్డి శంకర్, సత్యనారాయణ రెడ్డి, రంగసాయిరెడ్డి, గుండారెడ్డి, తదితరులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట నియోజకవర్గ మరియు మండల వైసిపి శ్రేణులు, అన్నా శ్రేయోభిలాషులు తదితరులు ఉన్నారు.

# నూతన ఆవిష్కరణ దిశగా ఆలోచించాలి

## - జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్



**మార్కాపురం రూరల్, మార్చి 3, ప్రభాతవార్త**
ప్రతి విద్యార్థి నూతన వస్తువును వేదిక తయారు చేసేలా, నూతన ఆవిష్కరణలు సృష్టించే దిశగా ఆలోచించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్ పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్‌డే వారోత్సవాలను సోమవారం మార్కాపురంలోని వాసవి విద్యానికేతన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ సైన్స్‌పట్ల ఆసక్తి కనబరుస్తూ విద్యార్థుల భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తయారు కావాలన్నారు. అనంతరం చెకుముకి సంబరాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ఆ పాఠశాల కరస్పాండెంట్ కందెరపు రంగయ్య చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు అపర్ణ, జనవిజ్ఞాన వేదిక యూత్ నాయకులు ఏనుగుల శివ, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు

## - ఎస్సై కోటేశ్వరరావు



**రాచర్ల, మార్చి 3, ప్రభాతవార్త**
ఈనెల 8వ తేదీ జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రమైన రాచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు తెలిపారు. ఉమెన్స్ సెలబ్రేషన్స్ డే కార్యక్రమంలో భాగంగా జాతీయ మహిలా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బాలికల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. బాలికల్లో దాగిఉన్న భయాన్ని తొలగించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు వివిధ కార్యక్రమాల ద్వారా వారికి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. బాలికలు బాలికలమనే భావన తొలగించుకొని స్నేహపూరిత వాతావరణంతో తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. బాలికల సంక్షేమం కోసం, అభివృద్ధికోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలతో పాటు చట్టాలను కూడా అమలు చేస్తుందని కాబట్టి బాలికలు ఎక్కడ కూడా అధైర్యం, నిరుత్సాహం లేకుండా అన్ని విషయాలలో ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి డి మాలకొండమ్మ, పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మదాపురం జడ్పీ హైస్కూల్లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



**హనుమంతునిపాడు, మార్చి 3, ప్రభాతవార్త**
మండలంలోని మహమ్మదాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా పదో తరగతి వీడ్కోలు, వార్షికోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గుంటూరులోని పీపుల్స్ న్యూరో ట్రామ హాస్పిటల్ డాక్టర్ కేసరి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన కుమారి బ్లెస్సికి రూ.50వేలు, రెండో బహుమతి సాధించిన ఎస్.నరసింహారెడ్డికి రూ.30వేలు , అలాగే మూడో బహుమతి సాధించిన కుమారి నాలి ప్రశాంతికి రూ.20వేలు, కేసరి వెంకటేశ్వరరెడ్డి వారి తల్లిదండ్రులు అందించడం జరిగింది. ప్రతి సంవత్సరం మండలంలో పదో తరగతిలో ప్రతిభ సాధించిన అందరికి ఇలాగే బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏతం శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ఎంఈఓలు గుర్రం పెద్దిరాజు, రమణయ్య, వెలిగండ్ల ఎంఈఓ రామిరెడ్డి ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొండయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు ఎలా రాయాలో తగిన మెలుకువలను అతిధులు తెలియజేయడం జరిగింది. చివరిగా విద్యార్థినీ విద్యార్థులు చేసిన వివిధ నృత్యరూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పలువురికి ఆర్థిక సహాయం అందజేసిన చిట్యాల



**హనుమంతునిపాడు, మార్చి 3, ప్రభాతవార్త**
మండల పరిధిలోని హాజీపురం, దాసర్లపల్లి గ్రామాలలో ప్రముఖ పారిశ్రామికవేత్త చిట్యాల వెలుగొండరెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చిట్యాల సుధాకర్‌రెడ్డి, చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి పలువురికి ఆర్థిక సహాయం అందజేశారు. హాజీపురం ఎస్సీ కాలనీలో దారా జకరయ్య కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.12వేలు ఆర్థిక సహాయం అలాగే దాసర్లపల్లి ఎస్సీ కాలనీలో బొజ్జ ప్రకాశం కుటుంబాన్ని పరామర్శించి పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా చిట్యాల విజయభాస్కర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు భవనం కృష్ణారెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, గురు ప్రసాద్, గాయం సుధాకర్‌రెడ్డి, రావి తిరుపతిరెడ్డి, నాగార్జునరెడ్డి, ఎంపీటీసీ నారాయణస్వామి, రాజు, సర్పంచ్ చిన్న, వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ లింగేశ్వరరావు, ఆవుల మల్లయ్య, దేవిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, వెంకటస్వామిరెడ్డి, వెంకటేష్, రాజారావు, సుందరు జగదబి, కొండం రాజు, కోటపాటి మోహన్‌రెడ్డి, కాటమరాజు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ కార్డులు పంపిణీ



**హనుమంతునిపాడు, మార్చి 3, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండల పరిధిలోని నల్లగండ్ల గ్రామ పంచాయతీలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ కార్డుల పంపిణీ పూర్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మారంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు వేషపోగు రాజేష్, బూత్ కమిటీ కన్వీనర్ మాలపాటి తిరుపతిరెడ్డి, సుమిత్ర, గ్రామ పార్టీ సభ్యులు మాలపాటి మనోహర్‌రెడ్డి, కనిగిరి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలసాని కోటయ్య, మండల ఐటీడీపీ యూనిట్ ఇన్‌ఛార్జీ ఎండ్లూరి అశోక్, సానికొమ్ము కొండారెడ్డి, సానికొమ్ము భాస్కర్‌రెడ్డి, వేషపోగు సుకుమార్, బలసాని ఏసేబు, వేసేపోగు నెహెమ్యా, వేసపోగు ఆదాం, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## క్యాండిల్స్ ర్యాలీ



**దర్శి, మార్చి 3, ప్రభాతవార్త**
మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సంతకముల సేకరణతో మూడో తేదీ క్యాండిల్ ర్యాలీ తోటి మత పెద్దలతో జరిపించారు. ముందుగా బాలికల ఉన్నత పాఠశాల నందు కిషోర్ బాలిక అయినటువంటి బాలిక పుట్టిన రోజు జరిపి అందులో భాగంగా బాల్య వివాహాల 18 సంవత్సరాలు వరకు చేయకూడదని బాలికలు అందరికి తెలియజేయడమైంది. ఈ పుట్టిన రోజు వేడుకలో పిల్లలందరికి స్విట్ హార్ట్ తోటి పాటుగా బెలూన్స్ అకాశమందు ఎగరేసి వాళ్ల ఉత్సాహాన్ని ప్రదర్శించుకున్నారు. ఇందులో స్కూల్ ప్రధానోపాధ్యాయులు అయినటువంటి ఖాదర్ మస్తాన్‌వలి, సీడీపీఓ సూపర్‌వైజర్స్, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్స్ పాల్గొన్నారు.

## ఎదురెదురు బైకులు ఢీ



**ముండ్లమూరు, మార్చి 3, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలం వేంపాడు వద్ద ఎదురెదురు బైకులు ఢీకొన్నాయి. చింతలపూడికి చెందిన దాసరి నాగేశ్వరరావు, భార్య నాగేశ్వరరావును ఒంగోలు రిమ్స్‌కు అద్దంకి 108 వాహనంలో ఈఎంటీ హరిబాబు, ఫైలెట్ శ్రీనివాసరావులు ప్రథమ చికిత్స చేస్తూ తరలించారు.

## జడ్పీగర్ల్స్ హైస్కూల్‌లో సిగ్నేచర్ క్యాంపెయిన్



**దర్శి, మార్చి 3, ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండో రోజు కార్యక్రమంలో భాగంగా జడ్పీ గర్ల్స్ హైస్కూల్ నందు కిశోరి బాలికైన గౌరీ శరణ్యకు పుట్టిన రోజు కార్యక్రమం నిర్వహించి సిగ్నేచర్ క్యాంపెయిన్ చేయడం జరిగింది. అలాగే ఎస్సీ బాలికల హాస్టల్ నందు బాలిక పేరు మీద ఒక మామిడి మొక్కను నాటించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సీడీపీఓ సీహెచ్ భారతి, హెచ్ఎం ఖాదర్ మస్తాన్‌వలి, సూపర్‌వైజర్స్ స్కూల్ టీచర్స్ స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించి బాలికని పుట్టనిద్దాం, ఎదగనిద్దాం చదవనిద్దాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు.

## నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త - గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, మార్చి 3, ప్రభాతవార్త**
గత ఐదేళ్ల వైసీపీ నిరుద్యోగులను గాలికి వదిలేసింది మన కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలల కాలంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా చకచక అడుగులు వేస్తుంది. ఇందులో భాగంగానే నేడు అసెంబ్లీలో గౌరవ ఐటీ శాఖ మంత్రి నారా లోకేషన బాబు, మెగా డీఎస్సీ త్వరలో ప్రకటిస్తామని చేసిన ప్రకటన. నిరుద్యోగ యువతకు ఊపిరి పోసింది. ఆనాడు నారా లోకేష్‌బాబు యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీని త్వరలో ప్రకటిస్తామని ఆయన హామీ ఇవ్వడం మనకు స్పూర్తిదాయకం, కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఒక్కొక్క హామీని అమలు చేస్తూ ముందుకెళ్తుందని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు.

## శుభకార్యక్రమంలో పాల్గొన్న యువనాయకులు కడియాల లలిత్ సాగర్



**దర్శి, మార్చి 3, ప్రభాతవార్త**
దర్శి పట్టణం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వడ్డమాని శ్రీనివాస శాస్త్రి- వెంకట నాగ భారతి కుమారుని వివాహ రిసెప్షన్ కార్యక్రమంలోని వధువరులు సత్యభరద్వాజ, లలితల వివాహ వేడుకకు టీడీపీ యువ నాయకులు కడియాల లలిత్‌సాగర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు టీడీపీ సీనియర్ నాయకులు కలువకొలను చంద్రశేఖర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దారం సుబ్బారావు, సుంకర రాఘవరెడ్డి తదితరులు నాయకులు ఉన్నారు.

### వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



దర్శి పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వడ్డమాని శ్రీనివాస శాస్త్రి వెంకట నాగ భారతిల కుమారుని వివాహ రిసెప్షన్‌లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఈ కార్యక్రమంలో దర్శి వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, జిల్లా నాయకులు కొల్ల ఉదయ్ భాస్కర్, మాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెలుగొండకు బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలి




**దర్శి, మార్చి 3, ప్రభాతవార్త**
వెలుగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో తక్షణమే రూ.2వేల కోట్లు కేటాయించి పూర్తి చేయాలని సీపీఎం దర్శి మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం దర్శి కమిటీ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1998లో 980 కోట్ల రూపాయల అంచనాతో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఇప్పటికి 28 ఏళ్లయిన ప్రాజెక్టు పూర్తి కాలేదు. పునరావాసం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వలేదు. ఇంకా రూ.4వేలు కోట్లు అవసరం ఉంది. ఈ బడ్జెట్‌లో కనీసం రూ.2వేల కోట్లు కేటాయించాలని నెల రోజులుగా సీపీఎం పోరాడుతుంటే ప్రభుత్వం కంటితుడుపుగా కేవలం రూ.309 కోట్లు మాత్రమే కేటాయించిందని దీంతో జిల్లా అభివృద్ధి పట్ల పాలకులకు, ప్రజా ప్రతినిదులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఇప్పటికైనా పారిశ్రామిక కారిడార్, దొనకొండ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దర్శి నియోజకవర్గానికి అమృత్ పథకం కింద రూ.121 కోట్లు కేటాయించామన్నారు. పనులు ప్రారంభించలేదు. ఎర్ర చెరువును మంచినీటి చెరువుగా మార్చి ఓవర్ హెడ్ ట్యాంక్ లు ఏర్పాటు చేసి, పైపులైన్లు మార్చి కొత్త పైపులైన్లు వేసి ఇంటింటికి కొళాయి ఇవ్వాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ దర్శిలో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ పనులు గత 5 ఏళ్ల నుంచి ఆగిపోయాయని నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కనిగిరి నిమ్జ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పటమే తప్ప దాని ఊసే లేదని, నిరుద్యోగులతో ప్రభుత్వాలు చెలగాటం మాడుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాండవ రంగారావు, ఉప్పు నారాయణ, ఎస్‌కే భాషా, జాన్ సామ్యేల్, అంజిబాబు, ఉప్పు మోహన్‌రావు, యోహోషువ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలే అన్ని రంగాల్లో ముందంజ - సీడీపీఓ సరోజిని



**కనిగిరి, మార్చి 3, ప్రభాతవార్త**
రానున్న రోజుల్లో మహిళలే అన్ని రంగాల్లో ముందుండాలని కనిగిరి సీడీపీఓ సరోజిని అన్నారు. సోమవారం కనిగిరి పట్టణంలోని మహిళా దినోత్సవం పురస్కరించుకుని మూడో రోజు సంతకాల సేకరణలో సీడీపీఓ సరోజిని మొదటి సంతకం చేసి సంతకాల సేకరణకు నాంది పలికారు. అనంతరం మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. మత పెద్దలతో కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ సరోజిని మాట్లాడుతూ వివక్షత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఈ దినత్సోవం ఒక వేదికగా పని చేస్తుందన్నారు. ప్రపంచ జనాభాలో దాదాపుగా 50 శాతం మహిళలు ఉన్నారు. ఉపాధిలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం వల్ల మహిళా పారిశ్రామక శక్తి రేటు పెరుగుతుందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం వల్ల విభిన్న దృక్పధాలు ప్రతిభ వెలుగులోకి వస్తాయన్నారు. అన్ని రంగాలలో మహిళలు చేర్చుకోవడం వల్ల లింక పక్షపాతం తొలగిపోతుంది. తద్వారా గృహహింస లైంగిక వేదింపులు మొదలైనవి తొలగిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు ఎంవీఎస్ పార్వతి, సుమతి, నాగమల్లేశ్వరి, ధనలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎడవల్లిలో వెలిసిన శ్రీశ్రీ సద్గురు కాశి నాయన స్వామి ఆశ్రమంలో నిత్య అన్నదానం



**పెద్దదోర్నాల, మార్చి 3, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం ఎడవల్లి వద్ద వెలసిన శ్రీశ్రీ సద్గురు కాశి నాయన స్వామి ఆశ్రమంలో నిత్య అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సోమవారం ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సంక్షేమార్ధం శ్రీ వాసుదేవ స్వామిజీ పర్యవేక్షణలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదానం, స్నానం గదులు రాత్రిపూట బస చేసేందుకు వసతులు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్ధం నిర్వహించే కాశీనాయన ఆశ్రమానికి భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాల్సిందిగా శ్రీ వాసుదేవ స్వామీజీ కోరారు.

## సేంద్రీయ చిరుధాన్యాల అవగాహన

**వేటపాలెం, మార్చి 3, ప్రభాతవార్త**



చిరుధాన్యాల పరిశోధన సంస్థ హైదరాబాద్‌కు సందర్శన నిమిత్తం రెండు రోజుల టూర్‌కి గాను తమ కళాశాల తరుపున బాపట్ల జిల్లా నుండి 50 మంది రైతులను ఎంపిక చేయగా వారిలో వేటపాలెం మండలానికి చెందిన కొత్తపేట, దేశాయిపేట రైతులు 15 మంది ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల వారు తెలియజేశారు. ఆధునిక యుగంలో సేంద్రియ పద్ధతుల ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి సాధించి, ఎక్కువ పోషకాలతో ఆరోగ్య ప్రయోజనాలు కలిగి నేరుగా ఉపయోగించగలిగితే చిరుధాన్యాలు అయిన జొన్నలు, సజ్జలు, రాగులు మొదలైన పంటల ఉత్పత్తి, నాణ్యత, గురించి రైతులకు అవగాహన నిమిత్తంఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చిరుధాన్యాలను సేంద్రీయ పద్ధతులతో ఎలా పండించాలి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహనకు రైతులు చిరుధాన్యాల రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించడం ఎంతైనా అవసరం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల తరుపున డాక్టర్ వినయ్ కుమార్, ప్రొఫెసర్ అండ్ హెడ్ జీపీబీఆర్ డిపార్టుమెంట్ లాల్ అహ్మద్, అసోసియేట్ డీన్ ప్రసున్న రాణి పాల్గొన్నారు.

## అధికారులూ.. మాకు దారి చూపరూ..



**వేటపాలెం, మార్చి 3, ప్రభాతవార్త**
దేశాయిపేట పంచాయతీ పెట్రోల్ బంకు వెనుక ఎస్సీ కాలనీలోని రోడ్లు ఆక్రమణకు గురై స్థానికులను భాగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎస్సీ కాలనీ వాసులు రోడ్డు ఆక్రమణ గురించి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి వారి సమస్య పరిష్కరించబడలేదు. రోడ్డు సగం ఆక్రమణకు గురి కాగా మిగిలిన సగం చిల్లచెట్లతో నిండిపోయి దారి పూర్తిగా మూసుకుపోయిన వైనం కనిపిస్తుంది. రాత్రి సమయంలో ఆ రోడ్లపై వాహనా ప్రయాణం నల్లేరు మీద నడకలా మారింది. ప్రమాదాల జరుగుతున్న ఆ రోడ్లపై మరణాలు సంభవిస్తే తప్ప అధికారులు స్పందించరేమో అని స్థానికులు వాపోతున్నారు. గల్లీ ఆక్రమణదారులతో పంచాయతీ అధికారులు లాలూచీ పడి ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినప్పటికి గల్లీని పట్టించుకోవడం లేదు అని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అదికారులు స్పందించి గల్లీ ఆక్రమణలను తొలగించి ప్రమాదాల నుండి కాపాడాల్సిందిగా కోరుతున్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ



**వేటపాలెం, మార్చి 3, ప్రభాతవార్త**
వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా సోమవారం తిరుమలశెట్టి ఝాన్సీ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆమె చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అంగన్‌వాడీ కేంద్రాలతోనే చిన్నారుల బంగారు భవితకు నాంది పలుకుతుందని సీడీపీఓ ఝాన్సీ తెలియజేశారు. ఈ సందర్భంగా నిత్యం అందుబాటులో ఉంటానని ఆమె పేర్కొన్నారు.

## మానవత్వం చాటుకున్న మావనతా సంస్థ



**పామూరు, మార్చి 3, ప్రభాతవార్త**
స్థాపించిన మూడు సంవత్సరాల్లోనే రాష్ట్రంలోనే ఉత్తమ సేవా సంస్థగా మానవత సేవా సంస్థ పేరుప్రఖ్యాతలు గాంచి పామూరు సభ్యులు చేస్తున్న కృషిణి రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శంగా తీసుకుంటున్నారంటే సేవా కార్యక్రమాలు ఏ విధంగా ఉన్నాయో అవగతం చేసుకోవచ్చు. రాయలసీమ నుంచి వచ్చిన రామచంద్రారెడ్డి స్పూర్తితో పామూరు మండలంలో కల్లూరి రామిరెడ్డి, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, ఆకుల చిన్న మెడబలిమి ముసలయ్య, మాల్యాద్రి తదితరులు కృషి ఫలితంగా నేడు ఐదు బ్రీజర్ బాక్సులు, ఒక చైతన్య రథం పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉచితంగా సేవలు అందించడం గర్వించదగ్గ విషయం అని పలువురు పేర్కొంటున్నారు. నిరుపేద విద్యార్థులకు, వారి విద్య అసంపూర్తిగా ఉండకూడదని తన వంతు సహాయంగా మానవత సభ్యులు ఉన్నత విద్యకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. పేదవారికి అనారోగ్య సమస్య ఏర్పడితే వారికి తక్షణమే సంస్థ ద్వారా కాకుండా తమకున్న పలుకుబడితో విరాళాలు సేకరించివారి కుటుంబాన్ని ఆదుకుంటున్నారు. దయాలసిస్ పేషెంట్లకు ఇటీవల వేలాది రూపాయలు వసూళ్లు చేసి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ మధ్య కాలంలో లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ పూర్తిగా దయాలసిస్ అవసరమైనందున అతనికి రూ.22,500లు దాతల దాతృత్వంతో పాటు సంస్థ ద్వారా నగదు అందజేసి మనుసుల్లో మానత్వం ఉందని నిరూపించారు. చదువుకు పేదరికం అడ్డురాకూడదనే ఉద్దేశంతో నిరుపేదల్లో మట్టిలో మానిక్యాలు అయిన గుర్తించి వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించి మానవత సంస్థ అండగా నిలుస్తుంది. నిస్వార్థం సేవలు అందిస్తున్న పామూరు మానవత సంస్థను అభినందించాలి. పలువురు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సర్వేజన సుఖినోభవంతు అందరూ బాగుండాలి, అందులో బాగుండాలి అనే నినాదంతో ముందుకు సాగుతున్న మానవత సంస్థ మరింత అభివృద్దిచెంది ఎంతో మందికి సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలంతా కోరుకుంటున్నారు.

### కాణిపాక వరసిద్ది వినాయక దేవస్థానంలో

## యువన్ష్ సాయికి అక్షరాభ్యాస కార్యక్రమం

**పామూరు, మార్చి 3, ప్రభాతవార్త**



జిల్లాలోని సీనియర్ రిపోర్టర్, పామూరు వార్త విలేకరి రాగిపాటి సుధాకర్- సుమతిల కుమార్తె తేజస్విని- అల్లుడు శివప్రసాద్‌ల ఏకైక కుమారుడు గోగులపాటి యువన్ష్‌సాయి అక్షరాభ్యాస కార్యక్రమం చిత్తూరు జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ది వినాయక దేవస్థానంలో బంధుమిత్రులు, అభిమానుల సమక్షంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు, రుత్వికులు



సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, సంప్రోక్షణ కార్యక్రమం ద్వారా నిర్వహించిన పూజాద్రవ్యాలను చిన్నారుల అక్షరా కార్యక్రమానికి వేదపండితుల నడుమ శాస్త్రోక్తంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఓం అనే బీజ అక్షరంతో మొదలు పెట్టి సంస్కృతంలో తొలి అక్షరాలను తల్లిదండ్రులు అయిన గోగుల పాటి శివప్రసాద్- నాగసాయితేజస్వినిలచే యువన్ష్‌సాయిచే పలకమీద దిద్దారు. కార్యక్రమంలో రాగిపాటి వంశస్తుల కులపెద్ద నరసింహులు, సుధాకర్, సుమతి, రాగలహరిక పాల్గొన్నారు.

## మహిళా వారోత్సవాల క్యాలెండర్ ఆవిష్కరణ



**నాగులుప్పలపాడు, మార్చి 3, ప్రభాతవార్త**
మహిళా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన నాగులుప్పలపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మండల పరిషత్ సిబ్బందితో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని మహిళా వారోత్సవాలు క్యాలెండర్ ఆవిష్కరణతో పాటు ప్రతిజ్ఞ చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న చట్టాలతో మహిళలు అభివృద్ధికి ఎంతో ఉపయోగంగా ఉంటాయని ఎంపీడీఓ మహాలక్ష్మీ తెలిపారు. అనంతరం కొవ్వొత్తులతో క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. నవజాతి శిశువులకు వెలుగు దీపిక ఈ మహిళా వారోత్సవాలు గిరిజల్లాలని కోరుతూ ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉషారాణి, శ్రీదేవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మసీదుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేస్తాం



**కనిగిరి,మార్చి 3, ప్రభాతవార్త**
కనిగిరి పురపాలక సంఘం పరిధిలో 20 వార్డుల యందు రంజాన్ మాసం సందర్భంగా మసీదుల యొక్క పరిసర ప్రాంతాల యందు పారిశుధ్యం, మౌలిక వసతులు మొదలగు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కమీషనర్‌ను ఆదేశించారు. సోమవారం కనిగిరి పురపాలక సంఘం కార్యాలయం నందు మసీదు ముస్లిం పెద్దలు, ఇమాం మౌజన్‌లతో సమావేశం ఏర్పాటు చేసి వారి సలహాల మేరకు రంజాన్ మాసంలో మసీదుల వద్ద అవసరమైన వసతులు(కరెంటు, లైట్లు, బ్లీచింగ్, సున్నం, నీళ్లు) ఏర్పాటు చేయబడునని తెలియజేశారు. ఈ సమావేశానికి పురపాలక సంఘం కమీషనర్, మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**కనిగిరి, మార్చి 3, ప్రభాతవార్త**
ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా కనిగిరి పట్టణంలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ సాయి యశ్వంత్ ఈశ్వర్ అన్నారు. సోమవారం ఎంఎస్ఎం డిగ్రీ కాలేజీ, కనిగిరి జూనియర్ కాలేజీలలో నిర్వహించిన పర్యటనలో అధికారులకు, కేంద్రాల వద్ద ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విద్యార్థులకు అవాంఛనీయ సంఘటనలు ఏర్పడకుండా సకాలంలో అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అనుమతించని వ్యక్తులు కేంద్రాలకు సమీపించకుండా పోలీసు బందోబస్తును మరింత కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. పరీక్షల పట్ల విద్యార్థులు నిర్భయంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులను వెంటనే సంప్రదించాలని సూచించారు. కనిగిరిలో పరీక్షలు సమర్ధవంతంగా కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొంటూ, విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ షేక్ ఖాజావలి, ఎస్సై టి.శ్రీరాం పాల్గొన్నారు.

### కస్తూర్భా గాంధీ బాలికా విద్యాలయంలో

## అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీ



**కనిగిరి, మార్చి 3, ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కనిగిరి పట్టణంలోని కస్తూర్భా గాంధీ బాలికా విద్యాలయంలో వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పోటీలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, మహిళా సాధికారిత, హక్కులు, సమానత్వం, వంటి అంశాలను తమ అభిప్రాయాలను వ్యాస రూపంలో వ్యక్తీకరించారు. శ్రీరామ్ మాట్లాడుతూ మహిళల శక్తిని గుర్తించి, వారికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థినులు,స్థానిక నాయకులు పాల్గొని విద్యార్థినులను ప్రోత్సహించారు.

## రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు

### - కనిగిరి నియజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్యామలకాశిరెడ్డి



**కనిగిరి, మార్చి 3, ప్రభాతవార్త**
ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా కనిగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్యామల కాశిరెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించిన ఈ పవిత్ర నెలలో ఉపవాస దీక్షలు పాటిస్తూ, అల్లాహ్ అనగ్రహాన్ని పొందేందుకు కృషి చేస్తారని అన్నారు. రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనలకు ప్రతీక అని అభిప్రాయపడ్డారు. ముస్లింలు ఈ నెలను అత్యంత పవిత్రంగా భావిస్తూ ప్రతి రోజు ఐదు సార్లు ప్రార్థనలు నిర్వహిస్తారని, ఈనెలలోనే అల్లాహ్ తన దూత ద్వారా ఖురాన్‌ను ప్రపంచానికి అందించారని అన్నారు. మానవత్వం, పరస్పర ప్రేమ, సామాజిక సేవకు రంజాన్ మాసం గొప్ప సందేశం ఇస్తుందని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు, కుటుంబ సభ్యులు ఆనందంగా ఐక్యంగా రంజాన్ మాసాన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## నిజాయితీని చాటుకున్న ఆటోడ్రైవర్

### - అభినందించిన ఎస్సై కిషోర్‌బాబు



**పామూరు, మార్చి 3, ప్రభాతవార్త**
మనది కాని వస్తువు తనకెందుకు అంటూ తనకు దొరికిన ల్యాప్‌ట్యాప్‌ను స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించి పామూరుకు చెందిన ఆటో డ్రైవర్ లక్కనబోయిన నారాయణ తన నిజాయితీని చాటుకున్నారు. ఆటోలో గుర్తు తెలియని ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగ్‌ను పరిశీలించగా అందులో ల్యాప్‌టాప్, ఇతర విలువైన పత్రాలు కలిగి ఉండటంతో చుట్టుపక్కల వారిని విచారించగా తనకు తెలియదని తెలపడంతో తక్షణమే పోలీసు స్టేషన్‌లో ఎస్సై కిషోర్‌ను కలిసి అందజేశారు. ఎస్సై కిషోర్ మాట్లాడుతూ నారాయణను ప్రశంసిస్తూ ప్రతి ఒక్కరూ సమాజంలో తమ వంతు విధిగా ఇతరుల వస్తువులు తమది కాదని భావించి ఆ ప్రాంతాల్లో విచారించి వారి వస్తువు రుజువు అయినచో తక్షణమే అప్పగించాలని, లేనిచో స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగిస్తే పోగొట్టుకున్న వ్యక్తికి చేర్చే వరకు పోలీసులు కృషి చేస్తారని అన్నారు. సమాజంలో ప్రతి పౌరుడు పోలీసేనని, తమ చుట్టు జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలపై ఎప్పటికప్పుడు పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించి నేర నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని ఆయన సూచించారు.

## యారవ శ్రీనును సన్మానించిన నారాయణస్వామి దేవస్థానం చైర్మన్



**పామూరు, మార్చి 3, ప్రభాతవార్త**
కనిగిరి వ్యవసామ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ శ్రీనును మిట్టపాలెం ప్రముఖ పుణ్యక్షేత్రమైన నారాయణస్వామి దేవస్థాన వంశపార్యఅధ్యక్షులు కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆదివారం రాత్రి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. చిన్న వయసులోనేరాజకీయాల్లో ప్రవేశించి ఆరు మండలాలకు చెందిన కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పొందడమే కాక దైవభక్తితో పాటు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్న శ్రీనివాసులు లాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సాయం అందించే యారవ శ్రీనివాసులు భవిష్యత్తులో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని చిన్న ఆదినారాయణ కోరారు.

## టంగుటూరు శ్రీ చైతన్యలో ఘనంగా సైన్స్‌ఫెయిర్



**టంగుటూరు, మార్చి 3, ప్రభాతవార్త**
స్థానిక టంగుటూరులోని శ్రీచైతన్య హైస్కూల్ నందు ఈ రోజు ఘనంగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు రకరకాల వైజ్ఞానిక ప్రదర్శనను చేసి ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ వివి రమణ, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.వెంకాయమ్మ, డైరక్టర్ వివి రాజసింహ, పత్తిపాటి బ్రహ్మానందం మొదలగు వారు పాల్గొని విద్యార్థుల ద్వారా ప్రదర్శించబడిన అన్ని వైజ్ఞానిక విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతిలోని విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించి వారి ద్వారా ప్రాజెక్టులను చేయించిన సైన్స్ ఉపాధ్యాయులైన పుణ్యహర్ష, షేక్ చిన్న సాహెబ్, సుమతి, వాసవి ప్రియాంకలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని సైన్స్ ఫెయిర్‌ని తిలకించడం జరిగింది.

## కొణిజేడులో ఆగని మైనింగ్.. చోద్యం చూస్తున్న అధికారులు



**ఒంగోలు, ప్రభాతవార్త**
కొణిజేడులో అక్రమ మైనింగ్ చేసే అక్రమార్కులుకు లెక్క లేకుండా పోతుందని.. ఏడు అడుగులు 8 అడుగులు గుంటలు తవ్వి లక్షల్లో ఇనుప ఖనిజం ఉన్న గ్రావెల్ మట్టి అమ్ముతున్నారని కొండేపి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి శ్రీపతి సతీష్ పేర్కొన్నారు. కంప్లైంట్ ఇచ్చిన రోజు ఒక టిప్పర్ పట్టుకొని హడావిడి చేసి మరుసటి రోజు నుంచి యదావిధిగా మట్టి తొవ్వకాలు చేస్తున్నారన్నారు. త్వరలో కలెక్టర్‌ని కలిసి పూర్తి వివరాలు అందజేస్తామన్నారు. ఎన్నిసార్లు స్పందనలో కంప్లైంట్ ఇచ్చిన స్పందన లేదని, పత్రికల్లో పుంకాలు పుంకాలు కథనాలు వచ్చినా అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన రోజు పోలీస్ పికెటింగ్ హడావుడి చేయడం, ఒక టిప్పర్ సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. తర్వాత అవి యదావిధిగా తిరుగుతున్నాయి. అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం వల్లే ఇంత విచ్చలవిడిగా మైనింగ్



జరుగుతుందని సతీష్ ఆరోపించారు. పూర్తి వివరాలతో కలెక్టర్‌కు వివరిస్తామని మైనింగ్ చేయడం వల్ల 8అడుగుల లోతు గుంటలు చేస్తున్నారన్నారు. తద్వారా నీరు చేరి పసిపిల్లలు పశువులు పడి చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇకనైనా కఠినచర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని తెలిపారు.

